

రోడ్డు ప్రమాదంలో మరణించిన మృతులు

గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల పర్మినెంట్‌కై

30న ఆందోళనలు

- సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరావు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ శాఖలలో, సంస్థలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల పర్మినెంట్ కై ఈనెల 30వ తేదీన దేశవ్యాప్తంగా, రాష్ట్రంలో అన్ని కలెక్టరేట్ల ఎదుట వేలాది మంది ఉద్యోగులు, కార్మికులతో ఆందోళనా కార్యక్రమాలు చేపట్టనున్నట్టు సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు ప్రకటించారు. తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగిన కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులు, ఉద్యోగుల జిల్లా సదస్సు జేఏసీ చైర్మన్ జి.నాగ వెంకటేష్ అధ్యక్షత జరిగింది. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏవి నాగేశ్వరరావు మాట్లాడుతూ టైం స్కేలు, కంటిజెంట్, పార్ట్ టైం, గెస్ట్, పీస్ రేట్, గౌరవ వేతనం తదితర నాన్ రెగ్యులర్ ఉద్యోగులకు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా వేతనాలు సౌకర్యాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వశాఖలు, ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వరంగ సంస్థలు, ప్రభుత్వ సొసైటీలు, యూనివర్సిటీలు, స్థానిక సంస్థలు, టీటీడీ వంటి ధార్మిక సంస్థల్లో నాన్ పర్మినెంట్ కార్మికులు, ఉద్యోగులందరికీ సమాపనికి సమాన వేతనం అమలు చేయాలని, పర్మినెంట్ చేయాలన్నారు. 2014 జూన్ ముందు నుండి నేషనల్ హెల్త్ మిషన్ ఇతర వైద్య ఆరోగ్య స్కీముల్లో పనిచేస్తున్న స్టాఫ్ నర్సులు, మెడికల్ సిబ్బందిని వివిధ వైద్యవిభాగాల్లో వయోపరిమితి ఇచ్చి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్, టీటీడీ సమగ్ర శిక్ష, స్విమ్స్, బర్డ్, రుయా, ఎస్వీయూ, వేదిక్, వెటర్నరీ, అగ్రికల్చర్, 108, 104, ఎలక్ట్రికల్, ఫారెస్ట్, టీటీడీ, అన్నమాచార్య, ఎన్‌హెచ్‌ఎం తదితర రంగాలలో పనిచేస్తున్న వారికి తక్షణమే హెచ్ఆర్ పాలసీ, సమాన పనికి సమాన వేతనం ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని, రెగ్యులర్, మినిమం టైం స్కేల్, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అలాగే జీతాలు ఒకటవ తేదీన వచ్చేటట్టు వార్షిక బడ్జెట్‌ను విడుదల చేయాలన్నారు. ఫుల్ టైమ్ స్కేల్ విధానాన్ని హెచ్ఆర్‌పి, డీఏతో అమలు చేసి వేతనాలు పెంచాలన్నారు. రూ.10లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్, గ్రాట్యూటీ కల్పించాలని చెప్పారు. సామాజిక భద్రతా పథకాలు, ఈపీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని కోరారు. వేతనంతో కూడిన మెడికల్ లీవ్ మంజూరు, పనిభారం తగ్గించేందుకు ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి జాబ్‌చార్ట్ ఇవ్వాలన్నారు. అన్ని సంక్షేమ పథకాలు అమలు చేసి ఎక్స్ గ్రేషియాను రూ. 20 లక్షలకు పెంచాలన్నారు. మరణించిన ఉద్యోగుల కుటుంబాలను ఆదుకునేందుకు కారుణ్య నియామకాలు చేపట్టాలని, మహిళా ఉద్యోగులకు చైల్డ్ కేర్ లీవులు మంజూరు చేయాలని అన్నారు. ఉద్యోగుల పైన రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం సరైంది కాదని అన్నారు, కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తర్వాత తొలగించిన ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా కక్షపూరితంగా వ్యవహరించే స్థానిక నాయకుల్ని కట్టడి చేయలని కోరారు. జేఏసి సభ్యులందరూ ఐక్యమత్యంగా ఉండి సమస్యల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆప్కాస్ రాష్ట్ర అధ్యక్షులు జి.చిన్నబాబు, జేఏసీ సెక్రెటరీ ఈ. లోకేష్ బాబు, సిఐటియు నగర కార్యదర్శి బి.వేణుగోపాల్, నేషనల్ హెల్త్ మిషన్ జిల్లా అధ్యక్షులు మొయిద్దీన్, నారాయణమ్మ, ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కుమార్, వ్యవసాయ కళాశాల నేతలు సుబ్బరత్నమ్మ, మునిలక్ష్మి, చంద్రమ్మ, అనురాధ, నాగరాజు, 108 ఉద్యోగుల సంఘం మునిరాజా, మహేష్, టీటీడీ కాంట్రాక్టు యూనియన్, సూపర్వైజర్స్, ఔట్సోర్సింగ్ నాయకులు రఘు, సిద్దయ్య, ప్రభాకర్, రుయా నరసింహులు, లక్ష్మీనారాయణ, వెటర్నరీ యూనివర్సిటీ నాయకులు మునిరాజా, గంగయ్య, వేదిక్ యూనివర్సిటీ కృష్ణమూర్తి, గోపి, ఎస్వీ యూనివర్సిటీ పద్మనాభం, ప్రతాప్, సహదేవ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు

చిల్లకూరులో ఘోరరోడ్డు ప్రమాదం

కంటైనర్‌ను వెనుక నుంచి ఢీకొన్న కారు

ముగ్గురు మృతి, ఐదుగురికి గాయాలు

ప్రజాశక్తి- చిల్లకూరు :

చిల్లకూరు జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారు జామున ఘోరరోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా, ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు.. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. నెల్లూరు జిల్లా వనంతోపు ప్రాంతానికి చెందినవారు ఎనిమిది మంది కారులో అరుణాచలంకు వెళ్లి దైవదర్శనం చేసుకుని తిరుగు ప్రయాణంలో చిల్లకూరు పోలీసుస్టేషన్ సమీపంలో తెల్లవారు జామున 4.30 గంటలకు రోడ్డుపక్కన ఆగి ఉన్న కంటైనర్ లారీని వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొంది. ఈప్రమాదంలో కారు డ్రైవర్ జగదీష్ (50), నెల్లూరు రూరల్ కాకుపల్లి గ్రామానికి చెందిన గోనెల బాబు (45), నెల్లూరు వనంతోపుకు చెందిన వడ్ల వెన్నెల మేఘన (8) మరణించారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడటంతో వారిని 108 ద్వారా గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం పోలీసులు సంఘటనా స్థలంలోని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

23న శ్రీవారి ఆలయంలో శాంతి హోమం

శ్రీవారి లడ్డూ ప్రసాదాల నాణ్యతపై భక్తులు సంతృప్తి

టీటీడీ ఈవో జె.శ్యామల రావు

మీడియాతో మాట్లాడుతున్న టిటిడి ఈవో

ప్రజాశక్తి- తిరుమల: ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తుల శ్రేయస్సుతో పాటు లడ్డూ ప్రసాదాల పవిత్రత, దైవత్వాన్ని పునరుద్ధరింపజేసేందుకు తిరుమల శ్రీవారి ఆలయంలో ఈనెల 23న శాంతి హోమం నిర్వహించనున్నట్లు టిటిడి ఈవో జె.శ్యామలరావు చెప్పారు. తిరుపతిలోని శ్రీ పద్మావతి విశ్రాంతి భవనంలో టీటీడీ ఈవో, అదనపు సిహెచ్ వెంకయ్య చౌదరితో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది శ్రీవారి భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా శ్రీవారి నైవేద్యంలో వాడే నెయ్యిలో కల్తీ ఉందని గుర్తించామన్నారు. సర్వపాప పరిహారార్థం, భక్తుల శ్రేయస్సును ఆకాంక్షిస్తూ సోమవారం ఉదయం 6 నుంచి 10 గంటల వరకు తిరుమలలోని బంగారు భావిష్యంత ఉన్న యాగశాలలో శాంతి హోమం నిర్వహించాలని టీటీడీ నిర్ణయించినట్లు తెలిపారు. ఇదివరకే ఆగస్టు 15 నుండి 17వ తేదీ వరకు టీటీడీ మూడు రోజులపాటు పవిత్రోత్సవాలను ఆకమోక్తంగా నిర్వహించిందని, అయితే శ్రీవారి నైవేద్యంలో కల్తీ పదార్థాలు ఉన్నది గుర్తించినందున, అందుకు పరిహారణగా శాంతి హోమం నిర్వహించాలని ఆగమ సలహా మండలి నిర్ణయించినట్లు చెప్పారు. లడ్డూల రుచిని మెరుగుపరిచేందుకు టీటీడీ చేపట్టిన చర్యలను వివరిస్తూ, టీటీడీ ప్రస్తుతం ఆవు నెయ్యి కొనుగోలు విధానాన్ని పూర్తిగా మార్చివేసిందని, స్వచ్ఛమైన ఆవునేయిని ఎంతో పారదర్శకంగా కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. ఈ సంస్కరణలతో ఇప్పుడు లడ్డూ ప్రసాదం రుచి అనేక రెట్లు మెరుగుపడిందని, భక్తులు కూడా ఎనలేని సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారని ఈవో వివరించారు. జేఈవో వీరబ్రహ్మం, ఆగమ సలహాదారులు మోహన రంగాచార్యులు, శ్రీరామకృష్ణ దీక్షితులు తదితరులు పాల్గొన్నారు.

స్పార్క్ ఆఫ్ ది ఇయర్‌గా రాజ్వి

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: తిరుపతికి చెందిన ఎమరాల్డ్స్ కళాశాల విద్యార్థులు ప్రతిభను వెలుగులోకి తెచ్చేందుకు నిర్వహించే పోటీ పరీక్షలలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థి రాజ్వి స్పార్క్ ఆఫ్ ది ఇయర్‌గా నిలిచింది. స్థానిక ఎల్ఐసి రోడ్డులోని ఎమరాల్డ్స్ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదివే విద్యార్థులకు ఆంగ్ల భాష సామర్థ్యాన్ని పెంచి, ఉన్నత ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు ప్రతి ఏడాది ఆ కళాశాల ఆధ్వర్యంలో కాన్ఫ్లుయెన్స్ పేరిట వినూత్న కార్యక్రమం నిర్వహిస్తారు. అందులో భాగంగా ఈ ఏడాది టాక్ ద టాక్, లిజన్ అప్, పిక్షన్ డిక్షన్, ఇంకు క్రాఫ్ట్ తదితర పోటీలు నిర్వహించారు. లిజన్ అప్‌లో ప్రతిభ నాయుడు ఇషిక జైన్, టాక్ ద టాక్ లో రాజ్వి, కీర్తన గ్రేస్, ఫిక్షన్ డెక్షన్‌లో లాస్య ఆనంద్, పృధ్వీరాజ్, ఇంకు క్రాఫ్ట్ పోటీలలో శైలు, షేక్ జషీరా ప్రథమ ద్వితీయ స్థానాలు సాధించారు. అత్యుత్తమ ప్రతిభతో రాజ్వి స్పార్క్ ఆఫ్ ది ఇయర్‌గా నిలిచింది. ఆదివారం జరిగిన ముగింపు కార్యక్రమాలకి ఆ కళాశాల డైరెక్టర్లు విశ్వనాధ్, గిరిధర్ ముఖ్య అతిథులుగా హాజరై బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్లు మునిరత్నం, జానకిరామ్, శ్రీనివాసులు, నాథముని, ప్రిన్సిపాల్ జాఫర్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఐఎస్‌బిలో పీజీ కోర్సులు ప్రారంభం

ప్రజాశక్తి-తిరుపతి సిటీ : ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో 20 నెలల పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాంని ప్రారంభించినట్లు ఆ కళాశాల డీన్ ప్రొఫెసర్ మదన్ పిల్లుట్ల తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఐఎస్‌బి 2001లో కార్యకలాపాలు ప్రారంభించినప్పటి నుండి మేనేజ్‌మెంట్ విద్యలో కొత్త బెంచ్‌మార్క్‌లను నెలకొల్పడానికి, ప్రపంచానికి భవిష్యత్తు నాయకులను తీర్చిదిద్దే లక్ష్యంలో మరో సంచలనాత్మక ప్రోగ్రాం – పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ ఫర్ యంగ్ లీడర్స్ ప్రారంభించినట్లు తెలిపారు. 2025 మధ్య నుండి ప్రారంభమయ్యే ఈ 20 నెలల పీజీపీ వైఎల్‌లో బిజినెస్ డిజైన్ ల్యాబ్, ఇన్నోవేషన్ ల్యాబ్‌తో సహా ముఖ్యమైన అనుభవపూర్వక అభ్యాస భాగాలు చేర్చి పాఠ్యాంశాలు రూపొందించబడ్డాయి. దీనిలో విద్యార్థులు తప్పనిసరిగా రెండు నెలల వేసవి ఇంటర్న్‌షిప్‌ను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఐఎస్‌బి, ఇతర అత్యుత్తమ అంతర్జాతీయ బి-పాఠశాలల నుండి ప్రఖ్యాత అధ్యాపకులు బోధిస్తారని వెల్లడించారు. 2025-27 విద్యా సంవత్సరానికి ప్రోగ్రామ్ ఫీజు రూ. 21,65,000 జిఎస్టీ, వసతి రుసుం రూ. 3,95,000. మెరిట్, మెరిట్-కమ్-నీడ్ ప్రమాణాల ఆధారంగా 40- 50శాతం తరగతి ఆధారిత స్కాలర్‌షిప్‌లు ఇవ్వబడతాయి. మెరిట్ స్కాలర్‌షిప్‌లు అర్హులైన అభ్యర్థులకు 100శాతం ట్యూషన్ మినహాయింపును పొందవచ్చుని, ఆసక్తి గల విద్యార్థుల అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రపంచ శాస్త్రవేత్తల జాబితాలో

ఎస్వీయూ విశ్రాంత ఆచార్యులు



ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ విశ్రాంత ఆచార్యులు ఆచార్య సికె.జయశంకర్ ప్రపంచ శాస్త్రవేత్తల జాబితాలో చోటు సంపాదించడం పట్ల ఎస్వీయూ విసి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు ఆనందం వ్యక్తం చేశారు. ఆయనను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఆచార్య జయశంకర్ వరుసగా ఐదవసారి ప్రపంచంలోని టాప్ 2శాతం శాస్త్రవేత్తలలో ఒకరుగా నిలిచినట్లు స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం సర్వే కనుగొందని తెలిపారు. ఈయన చిత్తూరు జిల్లా గుడిపాల మండలం చలిచిమలపల్లిలో జన్మించి ప్రభుత్వ కళాశాలలో చదివారు. జయశంకర్ ప్రపంచంలోని 6459 మంది శాస్త్రవేత్తలలో 3777, భారతదేశంలోని 129 మందిలో 56 మంది ర్యాంక్‌లు పొందారు. అలహాబాద్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఫెలో, ప్రొఫెసర్ జయశంకర్ ఫోటోనిక్స్, లేజర్ మెటీరియల్స్, గ్లాస్ సైన్స్, టెక్నాలజీలో ప్రత్యేకత కలిగి ఉన్నారు. వీరు 335 పరిశోధనా పత్రాలను ప్రచురించాడు. వీరి పర్యవేక్షణలో 34మంది విద్యార్థులు పిహెచ్‌డి పొందారు. వీరు యుయస్, యూరప్, మెక్సికో, ఆసియా దేశాలను కూడా వివిధ హోదాలలో సందర్శించాడు. గూగుల్ స్కాలర్ సైటేషన్ ప్రకారం, అతని పత్రాలు 14558 సార్లు హెచ్-ఇండెక్స్ 69తో ఉదహరించబడ్డాయి. అనేక సైంటిమెట్రిక్ విశ్లేషణలలో నిమగ్నమై ఉన్నారు.

కల్తీ నెయ్యి పై సిబిఐ విచారణ జరిపించాలి

- బాబు పాపాలు కడుగుకునేందుకే ఆలయ శుద్ధి
- మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి

ప్రజాశక్తి- తిరుపతి సిటీ : శ్రీవారి లడ్డు ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడారని సీఎం చంద్రబాబు నాయుడు చేసిన ఆరోపణలు అవాస్తవమని, దీనిపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి చేతకాని, సిబిఐ చేతకాని విచారణ జరిపించాలని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి సవాల్ విసిరారు. తిరుపతిలోని ఆయన నివాసంలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ తిరుమల శ్రీవారి పూజలు, కైంకర్యాలు, నైవేద్య ప్రసాదాలు వంటివి అగమశాస్త్రం ప్రకారం, నిపుణుల పర్యవేక్షణలో జరుగుతాయాన్నారు. వైసిపి హయాంలో టీటీడీని భ్రష్టు పట్టించారని ఎన్నికల సమయంలో బాబు ప్రచారం చేశారని, ఆ తర్వాత విజిలెన్స్ కమిటీ ఏర్పాటు చేశారని, ఇవేవీ ఫలితం ఇయ్యకపోవడంతో కల్తీ నెయ్యి వ్యవహారాన్ని తెరపైకి తెచ్చారని విమర్శించారు. వైయస్ జగన్‌ని, వైఎస్సార్సీపీని నామరూపాలు లేకుండా చేసి, రాజకీయంగా అనగదొక్కాలనే ఉద్దేశంతోనే ఇలాంటి దిగజారుడు రాజకీయాలకు పాల్పడ్డారని ధ్వజమెత్తారు. దేవుడితో రాజకీయాలు చేయడం దుర్మార్గమన్నారు. ఏ పాలక మండలిలోనైనా నెయ్యి సరిపడా తదితర వాటిని పర్యవేక్షించేందుకు కమిటీ ఉంటుందని, తమ హయాంలో ఉన్న కమిటీలో ప్రస్తుతం టిడిపి మంత్రిగా ఉన్న పార్థసారథి, టిడిపి ఎమ్మెల్యేగా ఉంటున్న వేమూరి ప్రశాంతిరెడ్డి, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు అత్యంత సన్నిహితుడు, ప్రధాని నరేంద్ర మోడీకి సుపరిచితుడైన వైద్యనాథన్ కృష్ణస్వామి సభ్యులుగా ఉన్నారని, వారే ఈ విమర్శలపై నిజానిజాలు నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. శకుని కంటే దుర్మార్గపు మనసువత్వం చంద్రబాబుదని తీవ్రంగా విమర్శించారు. టిడిపి హయాంలో సరఫరా అయిన నెయ్యి రిజెక్ట్ అయితే, దానికి వైసిపి ఏ కారణమని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. టిడిపి హయంలో నందిని నెయ్యి ఎందుకు పూర్తిస్థాయిలో వాడలేదని ప్రశ్నించారు. ఆ పార్టీ హయాంలో హెల్త్ ఆఫీసర్‌గా పని చేసిన సరిష్ట సైతం ప్రసాదాల తయారీలో కల్తీ జరిగే ఆస్కారమే లేదని ప్రకటించిన విషయం వాస్తవం కాదా అన్నారు. ప్రస్తుతం బాబు విమర్శిస్తున్న తమిళనాడుకు చెందిన ఇదే కంపెనీ టిడిపి హయాంలో కూడా నెయ్యి సరిపరా చేసిందన్నారు. ఆలయ ప్రతిష్టను సర్వనాశనం చేసేందుకు చంద్రబాబు కంకణం కట్టుకున్నారని విమర్శించారు. కలుషితమైంది నెయ్యి కాదు.. బాబు మనస్తత్వం అన్నారు. వాస్తవానికి టీటీడీ అభివృద్ధికి కృషి చేసింది, శ్రీవారి వైభవాని విశ్వనాథం చేసేందుకు కృషిచేసింది వైఎస్సార్, వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని గుర్తు చేశారు. టీటీడీ అభివృద్ధికి చంద్రబాబు మచ్చుకి ఒకటైన చేశారా అని ప్రశ్నించారు. చంద్రబాబు ఆరోపణలపై ప్రధాని నరేంద్ర మోడీ స్పందించాలని, సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి చేత, సిబిఐ చేత విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. తమ హయాంలో తప్పు జరిగి ఉంటే అందుకు బాధ్యులైన తాము శిక్ష అనుభవిస్తామని, బాబు చేసే ఆరోపణలవాస్తవమైతే ఆ దేవుడే ఆయన్ని శిక్షిస్తాడని హెచ్చరించారు.

భూములిచ్చిన రైతుకే ఉరివేస్తారా...

- చిత్తూరు- తచ్చూరు హైవేపై వంటవార్పు
- అధికారులు దిగివచ్చి.. రైతుల కష్టాలను చూడండి
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ హెచ్చరిక

ప్రజాశక్తి- పుత్తూరు టౌన్

చిత్తూరు-తచ్చూరు హైవే రోడ్డును చూస్తే భూములిచ్చిన రైతుకే ఉరివేస్తున్నట్లు అనిపిస్తున్నాయని, భూములు తీసుకునే ముందు అధికారులు ఇచ్చిన మాటలను నిలబెట్టుకోవాలని సీపీఐ పార్టీ జాతీయ కార్యదర్శి నారాయణ హెచ్చరించారు. ఆదివారం హైవేకు భూములిచ్చిన రైతులతో కలిసి, నగరి సమీపంలో చిత్తూరు-తచ్చూరు హైవేపై వంటవార్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్తూరు-తచ్చూరు హైవే పక్కన పంట పొలాలకు సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలని గతంలో కోరినా అధికారులు ఇంత వరకు పట్టించుకోవడం లేదన్నారు. హైవేకు పక్కన సర్వీస్ రోడ్డు వేసేంత వరకు పనులు జరగడానికి వీలేదన్నారు. చిత్తూరు- తచ్చూరు మధ్య హైవే రోడ్డు వేయడం మంచిదే...కానీ హైవేకు భూములు ఇచ్చిన రైతు పొలాలకు వెళ్లడానికి వీలులేకుండా సర్వీస్ రోడ్డుకు ఇరుపక్కల 5 అడుగల ప్రహరీ గోడలు నిర్మించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇది రైతులను ఉరితీయడమే అంటూ ఆయన మండిపడ్డారు. రైతు పండిన పంటలను తరలించడంలో రైతులు క్లిష్టపరిస్థితులు ఎదుర్కోవల్సి వస్తుందని సూచించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా సిపిఐ జిల్లా కార్యదర్శి నాగరాజు, నగరి మండల కార్యదర్శి కోదండం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఐ నారాయణ

పనుల కల్పనే లక్ష్యంగా ప్రణాళికలు

- ఇప్పటికే 100 కోట్ల పనిదినాలు మంజూరు
- ఉపాధి హామీ పీడీ శ్రీనివాస ప్రసాద్

ఇంటర్వ్యూ

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం):

జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా తిరుపతి జిల్లా పరిధిలోని 33 మండలాల్లో పని దినాలు కల్పించి గ్రామీణ ప్రాంతాల రూపురేఖలను మార్చుతున్నామని జాతీయ ఉపాధి హామీ పథకం ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. తిరుపతి జిల్లా పరిధిలో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా ఎలాంటి లక్ష్యాలను నిర్దేశించుకోన్నారు. వాటి అమల చేసిన ప్రణాళికలను ప్రజాశక్తి ముఖాముఖిలో పీడి పంచుకున్నారు.

ప్రజాశక్తి: ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి తిరుపతి జిల్లా పరిధిలో ఎన్ని పని దినాలను కల్పించారు..?

పిడి: ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రారంభమైన ఆర్థిక సంవత్సరం నుండి ఉపాధి హామీ పథకం ద్వారా గడిచిన 5నెలల కాలంలో 65 లక్షల పనిదినాలను కల్పించాం. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ సూచనలతో మరింతగా పనిదినాల కల్పనకు శ్రీకారం చుడుతున్నాం.

ప్రజాశక్తి: గత మాసం ఆగస్టులో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన గ్రామసభలలో ఆమోదించిన తీర్మానాలకు ఇప్పటి వరకు ఎన్ని పనిదినాలను కల్పించారు..?

పిడి: రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు నెలలో నిర్వహించిన గ్రామసభలలో వచ్చిన తీర్మానాలకు ఇప్పటికే 100 కోట్లకు పైగా పనిదినాలను మంజూరు చేయడం జరిగింది. మొత్తం 150 కోట్లకు పైగా పనులకు తీర్మానాలు వచ్చాయి. మొదటి ప్రాధాన్యతగా 100 కోట్లకు పనిదినాలను మంజూరు చేశాం. దీని వలన గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన మౌళిక వసతులు కల్పించబడుతాయి.

ప్రజాశక్తి: జాతీయ ఉపాధి హామీ పథకం ప్రారంభం నుండి ఇప్పటి వరకు ఎక్కువగా పని దినాలను కల్పించిన సందర్భాలు ఏదేని ఉన్నాయా?

పిడి: జాతీయ ఉపాధి హామీ పథకం ప్రారంభం నుంచి ఇప్పటి వరకు గత ఆర్థిక సంవత్సరంలో 54 వేల కుటుంబాలకు 100 రోజుల పని దినాలను కల్పించాం. ఇదీ రాష్ట్రంలోనే కాకుండా జాతీయంగా పరిశీలిస్తే 30.3 శాతం అధికంగా పనిదినాలను కల్పించాం. ఇది ఓ రికార్డుగా చెప్పవచ్చు.

ప్రజాశక్తి: ఉపాధి హామీ ద్వారా పని దినాల కల్పనకు చేసిన ప్రణాళికలను వివరించండి?

పిడి: జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి అవకాశాలను మరింత మెరుగ్గా కల్పించడానికి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రత్యేకచొరవ తీసుకున్నారు. అందుకు అనుగుణంగా రాబోవు రెండు సంవత్సరాలలో ప్రణాళికాబద్ధంగా మౌళిక వసతులు కల్పించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నాం.

శ్రీనివాస ప్రసాద్, ఉపాధి హామీ పీడీ

'హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయి'

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం): తిరుమల శ్రీవారి ప్రసాదం అయిన లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగం యావత్ హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయని ప్రముఖ సినీ సీరియల్ నటుడు బాలాజీ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన టిడిపి నాయకులతో కలిసి మాట్లాడారు. శ్రీవారి క్షేత్రంలో ఇలాంటి సంఘటనలు మళ్ళీ పునరావృత్తం కాకుండా ప్రభుత్వం కఠినచర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. టిడిపి నాయకులు జగన్నాధం, తులసీదాస్, విశ్వనాధం తదితరులు పాల్గొన్నారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సీరియల్ నటుడు బాలాజీ

కల్తీ నెయ్యి వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలి

శ్రీవారి భక్తులు ఎంతో భక్తితో స్వీకరించే లడ్డూల తయారీలో కల్తీ నెయ్యి వాడారన్న విషయం శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని, దీనిపై సమగ్ర విచారణ జరిపి దోషులను శిక్షించాలని టిడిపి సీనియర్ నాయకుడు ఆముదాల శ్రీహరి అన్నారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల 6సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో వైసిపి ప్రభుత్వ హాయంలో తిరుమల కొండపై అనేక అక్రమాలు జరిగాయని దీనిపై కూడా ప్రభుత్వపెద్దలు దృష్టి సారించి నిజాలు నిగ్గుతేల్చాలని కోరారు.

బాలికపై లైంగిక దాడి

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

ఓ బాలికపై అన్నవరసైన దూరపు బంధువు లైంగిక దాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథల మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఉద్యోగ నిమిత్తం బెంగళూరులో నివాసం ఉంటున్న ఓ మహిళ తన కుమార్తె చదువు కోసం తిరుపతి జీవకోనలోని అమ్మమ్మ ఇంటి వద్ద ఉంచింది. 12 సంవత్సరాల బాలిక ఎనిమిదో తరగతి చదువుకుంటుంది. అదే ఇంట్లో ఉంటున్న అన్నవరసైనా దూరపు బంధువు 20 సంవత్సరాల యువకుడు ఇంటిలో ఎవరు లేని సమయంలో ఆ బాలికపై లైంగిక దాడికి పాల్పడేవాడు. గత ఆరు నెలలుగా ఆ బాలికపై తరచూ లైంగిక దాడి చేసేవాడు. ఈ విషయాన్ని ఇటీవల జరిగిన వినాయక ఉత్సవాల సందర్భంగా తిరుపతికి వచ్చిన తన తల్లికి తెలియజేసి బోరను విలపించింది. దీంతో అమ్మమ్మ వాళ్లతో గొడవకు దిగిన ఆమె, ఆదివారం పోలీసులను ఆశ్రయించి, తన బిడ్డకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేసింది. దీంతో అలిపిరి పోలీసులు కేసు నమోదు చేసి, నిండితుడు కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

రాజ్ దర్బార్ రెస్టారెంట్ ప్రారంభం

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

తిరుపతిలో నూతనంగా ఏర్పాటు చేసిన రాజ్ దర్బార్ రెస్టారెంట్‌ను తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు, నగిరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ నాయుడు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రారంభించారు. స్థానిక కొర్లగుంటలోని తిరుమల బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన రెస్టారెంట్ వద్ద వారు విలేకరులతో మాట్లాడుతూ తిరుపతి వాసులకు శ్రీవారి భక్తులకు మరింత రుచికరమైన, నాణ్యమైన ఆహార పదార్థాలు అందించాలని ఉద్దేశంతో రాజధర్బార్ హోటల్‌ని నెలకొల్పాడు అభినందనీయం అన్నారు. హోటల్ అధినేతలు కేజీ కుమార్, కె.శాంతి, కేజీ కే.సురేష్ మాట్లాడుతూ తమ ఓటర్ల ప్రత్యేకంగా నలగాన్ని బిర్యాని, హైదరాబాద్ దమ్ బిర్యాని, తైపాడ్ చికెన్, కుంఫా చికెన్, చైనీస్ వెరైటీలు లభ్యమవుతాయన్నారు. నాణ్యతలో ఎలాంటి రాజీ పడకుండా రుచికరమైన శుభ్రమైన ఆహారాన్ని అందిస్తామని వెల్లడించారు. తిరుపతి వాసులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో చైర్మన్ పులిగోరు మురళీకృష్ణ రెడ్డి, మబ్బు దేవ నారాయణ రెడ్డి, దొడ్డరెడ్డి సిద్దారెడ్డి, బాలగిరి ప్రతాపరెడ్డి, రుయా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు బండ్ల లక్ష్మీపతి, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ఎల్ఐసి ఏజెంట్స్ యూనియన్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి శాఖ ఎల్ఐసీ ఏజెంట్స్ నూతన కార్యావర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎస్.నారాయణ స్వామి, కార్యదర్శిగా యాచమనేని బాబురావు, ట్రెజరర్‌గా కూనాటి ఈశ్వర్‌ను ఎన్ను కోవడం జరిగింది. గౌరవ అధ్యక్షుడిగా శ్రీమన్నారాయణ, ఉపాధ్యక్షులుగా ఎస్.రామచంద్రారెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా డి.ఈశ్వరరెడ్డి, ఎం.మణి, ఆర్గనైజేషన్ సెక్రటరీగా ఎస్.గోవింద్ రెడ్డి పి.రాంబాబు, పి.ఉమాదేవి, మహిళా ప్రెసిడెంట్‌గా కె.మాధవి ఎన్నికయ్యారు.. ఎల్ఐసీ ఏజెంట్ల సమస్యలపై యూనియన్ పోరాడుతుందని నూతన కార్యవర్గం తెలిపింది.

నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సేవలు 154వ నెలకు చేరుకున్నాయి. ఆదివారం డీఎస్పీ నరసింహమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రతిభావంతులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు షాకీర్ అలీ, న్యాయవాదులు రాజేశ్వరరావు, గరికిపాటి రమేష్, కంఠ ఉదయ్, హెల్పింగ్ హాండ్స్ సభ్యులు మునీర్ బాషా, ఫరీద్, హరి నాయుడు, ఢిల్లీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మర్రి ఢిల్లీ బాబుకు అవార్డు ప్రదానం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పుత్తూరుకు చెందిన ఉత్తమ సంఘ సేవకులు మర్రి ఢిల్లీ బాబుకు మదర్ థెరిసా ఇంటరనేషనల్ అవార్డు దక్కింది. ఈ అవార్డును తమిళనాడులోని తిరుచ్చి హోటల్ అరుణలో ప్రదానం చేశారు. గత 25 సంవత్సరా లుగా సామాజిక, విద్యా, మహిళలు పిల్లలుకు సంబందించిన ప్రభుత్వేతర కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల ఈ అవార్డును తొలసా మెక్సికో (అమెరికా) యునివర్శిటి ఇండియన్ చైర్మన్ డాక్టర్ వి.కట్టబొమ్మన్ ద్వారా జిల్లా ఇంచార్జి బాలు అందించారు. ఈ అవార్డు రావడంతో ఆయనను పలువురు అభినందించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి, ఎండి అమల, బిసిఐటి కోఆర్డినేటర్ బాలు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

ప్రజాశక్తి-వరదయ్యపాలెం: మండలంలోని అవంతి లెదర్స్ పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ ధనేకుల వాసుదేవరావు ఆధ్వర్యంలో తిరుపతి ఎస్వీ అరవింద్ కంటి వైద్యాశాల వారి సౌజన్యంతో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మొత్తం 147మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 24మందికి కంటి సంబంధిత ఆపరేషన్ చేయాలని నిర్ధారించారు. వైద్య శిబిరం అనంతరం ఆపరేషన్ అవసరమైన వారిని అరవింద వైద్యాశాలకి పంపుతున్నట్లు ఆ పరిశ్రమ జనరల్ మేనేజర్ నార్ల లీల కృష్ణ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ భవ్య, వారి సిబ్బంది, అవంతి సిబ్బంది వేంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు గుర్తింపు కార్డులు పంపిణీ

ప్రజాశక్తి-సత్యవేడు: మండలంలోని జానపద కళాకారులకు గుర్తింపు కార్డులను కళాకారుల సంఘం గౌరవాధ్యక్షులు రమేష్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి పంపిణీ చేశారు. తమిళనాడు సూరావారికండ్రిగలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి 65మంది కళాకారులకు ఈ కార్డులను అందజేశారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు మొబైల్ కమ్యూనికేషన్ అసోసియేషన్ సభ్యులు వరద బాధితుల ఆర్థిక సాయం ప్రకటించారు. ఆదివారం రూ.30వేల చెక్కును గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్‌కి అందజేశారు. ఎమ్మెల్యే వారిని అభినందించారు. అసోసియేషన్ అధ్యక్షులు రామ్మోహన్ రావు, వైస్ ప్రెసిడెంట్ రాజా చౌదరి, జనరల్ సెక్రటరీ తేజ, తదితరులు పాల్గొన్నారు.

'సజ్జల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి'

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: రాష్ట్ర ప్రభుత్వం సజ్జలకు ఆర్భాటంగా మద్దతు ధర ప్రకటించడం బాగానే ఉన్నా.. కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తేవాలని ఏపీ రైతు సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షులు దాసరి జనార్ధన్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రూ.2625క్వింటాల్‌కు ధర ప్రకటించి రైతుల వద్ద నుంచి కొనుగోలు చేయకుండా వ్యాపారస్తులు రూ.2వేలు, రూ.2100చొప్పున తీసుకొని మోసం చేస్తున్నారని ఆ ప్రకటనలో మండిపడ్డారు. ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టి కొనుగోలు కేంద్రాలను రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తించారు.

ఘనంగా కోటా చంద్రబాబు జన్మదిన వేడుకలు

అన్నదానం చేస్తున్న చంద్రబాబు దంపతులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: జనసేన సీనియర్ నేత, ఆ పార్టీ నియోజకవర్గ అధ్యక్షురాలు కోటా వినుత భర్త కోటా చంద్రబాబు జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి రోగులకు పండ్లు, బ్రెడ్లు, జ్యూస్ పంపిణీ చేశారు. గోశాలలోని గోవులకు పసుగ్రాసం దానం చేశారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద మునిసిపల్ సిబ్బందికి బెడ్ షీట్లు పంపిణీ చేశారు. పెళ్లి మండపం వద్ద కేక్ కటింగ్ చేసి అన్నదానం చేశారు. పలువురు జనసేన నేతలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు

ప్రజాశక్తి-గూడూరు టౌన్: యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా గూడూరు జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన ఉపాధ్యాయులను జిల్లా స్థాయి క్రీడా పోటీలకు పంపుతామన్నారు. ఈనెల 29న జిల్లా స్థాయి క్రీడా పోటీలు జరగనున్నట్లు ఫెడరేషన్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి సుధీర్, వాసుదేవరావు, నాయకులు రవి, మురళి సింగ్, మురళీమోహన్, నాగేశ్వరరావు, ప్రాణేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు

వృద్ధ దంపతులకు చేయూత

ప్రజాశక్తి-నాయుడుపేట: పట్టణంలో గత కొంత కాలంగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న బలిజ సామాజిక వర్గానికి చెందిన వృద్ధ దంపతులు చోపకట్ల జానకి రామయ్య, రాజేశ్వరమ్మలకు ఆదివారం బలిజ ఐక్యవేదిక సభ్యులు ఆర్థిక సాయం అందజేశారు. నాయుడుపేటకు చెందిన వ్యాపారవేత్త ఆకుల కుబేరమణి ఆధ్వర్యంలో వారి బృంద సభ్యులు దాతృత్వం చాటుకున్నారు. ఆ దంపతులకు తమవంతు సాయంగా రూ.15వేలు నగదును అందించారు. అలాగే నెలకు సరిపడా సరుకులు, కూరగాయలు, నూతన వస్త్రాలు, మందులు అందజేశారు. కార్యక్రమంలో ఏవి కుమార్, కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, గిరి జయప్రకాష్, మహేష్, సురేంద్ర, శేషగిరి, చిట్టిబాబు, రోహిణి కుమార్, బాలాజీ, దశరథ, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందిస్తున్న దాతలు

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలి

- జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఎస్.చంద్రశేఖర్

మొక్కలు నాటుతున్న జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఎస్.చంద్రశేఖర్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి ఎస్.చంద్రశేఖర్ అన్నారు. తొట్టంబేడు ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహంలో ఆదివారం తల్లిదండ్రుల సమావేశం, స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వసతి గృహ పరిసరాలు శుభ్రం చేశారు. అదేవిధంగా వసతి గృహ ప్రాంగణంలో కొబ్బరి మొక్కలు నాటారు. వసతి గృహంలో సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. అంతకు మునుపు ఏర్పాటు చేసిన సమావేశంలో చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి బాల్యం నుంచి ఒక ఉన్నత ఆశయంతో ముందుకు వెళ్లాలన్నారు. క్రమశిక్షణ, పట్టుదల, అంకితభావంతో చదివితే అనుకున్న లక్ష్యం సులభంగా చేరవచ్చన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవ అలవరచు కోవాలని చంద్రశేఖర్ సూచించారు.

పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: ప్రతి విద్యార్థి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి చంద్రశేఖర్ సూచించారు. మండల కేంద్రంలోని బీసీ వెల్ఫేర్ వసతి గృహాన్ని ఆదివారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలసి మానవహారం నిర్వహించి, ప్రతిజ్ఞ చేపట్టారు. అనంతరం పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వసతి గృహంలో స్థితిగతులపై ఎప్పటికప్పుడు చూసి సరి చేసుకోవాలని వసతి గృహం అధికారి రామయ్యకు సూచించారు. పిల్లల ఆరోగ్య పరిస్థితులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా విద్యార్థులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తూ ఉండాలని ఆదేశించారు. పరిసరాల్లో చెత్తాచెదారం, మురుగునీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది హైమావతి, చెంగయ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై నిరంతర పోరాటం: ఏపీటీఎఫ్

సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో శేఖర్

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: ఉపాధ్యయ సమస్యలపై ఏపీటీఎఫ్ నిరంతరం పోరాటం చేస్తుందని ఫెడరేషన్ నాయకులు ఉద్ఘాటించారు. ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఏపీటిఎఫ్ 80వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా విద్యా వైజ్ఞానిక మహాసభ ఆదివారం బాబు జగ్జీవన్ రావు భవన్ తిరుపతిలో జిల్లా అధ్యక్షుడు రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఈవో శేఖర్ హాజరై, మాట్లాడుతూ మెరుగైన విద్యా వ్యవస్థ బలోపేతం కావడానికి వేదికగా విద్యా వైజ్ఞానిక మహాసభలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారంతో పాటు ప్రభుత్వ విద్యారంగా పరిరక్షణ కోసం సమాజ శ్రేయస్సు కోసం సంఘం పాటుపడాలని సూచించారు. తిరుపతి ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి చాలా పవిత్రమైనది, ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకుని పోవడానికి కృషి చేయాలన్నారు.రాష్ట్ర అదనపు కార్యదర్శి చెంగల్రాయ మండడి మాట్లాడుతూ 117జీవో రద్దు చేయడానికి ప్రభుత్వం త్వరలో చూపాలని ప్రాథమిక పాఠశాలలను విలీనంపై స్పష్టత ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐఫియా జాతీయ చీఫ్ పాట్రాన్ కే.సుబ్బారెడ్డి మాట్లాడుతూ సంఘ చరిత్ర సాధించిన విజయాలను గురించి వివరించారు. బోధనకు ఆటంకంగా ఉన్న కృత్యాలను తొలగించి స్వేచ్ఛగా బోధన చేసే పరిస్థితులు కల్పించాలని అన్నారు. ఈ సమావేశంలో తిరుపతి, పుత్తూరు ఉపవిద్యా శాఖ అధికారులు బాలాజీ, ప్రభాకర్ రాజు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రమేష్, సురేష్, రాష్ట్ర నాయకులు శివరామిరెడ్డి, బాబు ఆనంద నాయుడు, కిరణ్, రవీంద్ర, జిల్లా నాయకులు నరేంద్ర, మావల్లయ్య, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

మైదానానికి దారి మూసివేత

- పలువురి అభ్యంతరం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఎస్ఆర్ఎస్ కళాశాల సిబ్బంది క్రీడా మైదానంకి వెళ్లే దారిలో గోతులు తీసేశారు. పెద్ద గుంతను తవ్వి దారిని మూసివేశారు. దీన్ని గమనించిన సీనియర్ సిటిజన్‌లు ఆదివారం తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. అటుగా వెళ్లి దారిని పరిశీలించారు. క్రీడాకారులు, వృద్ధులులకు ఇబ్బంది కలిగించడం బాధాకరమన్నారు. మైదానంలో వ్యాయం కోసం వచ్చే వారిని ఇబ్బందుకు గురిచేయడం సరికాదని అసహనం వ్యక్తం చేశారు. దారిని మూసివేయడం సరికాదన్నారు. ఆ గుంతను పూడ్చివేసి తిరిగి మైదానంలోకి దారి సౌకర్యం కల్పించాలని కోరారు.

రహదారి భద్రతపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణంలోని పెళ్లి మండపం వద్ద రహదారి భద్రతపై శ్రీకాళహస్తి పోలీసుల ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యంగ్ ఎంప్లాయిస్ సోషల్ సర్వీస్ సహకారంతో ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి హెల్మెట్లు, రేడియం జాకెట్స్, బ్యాటెన్స్, కంటి అద్దాలు, రెయిన్ కోట్స్ అందించారు. డీఎస్పీ నరసింహమూర్తి, సీఐ గోపి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో కేశవరెడ్డి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: రేణిగుంట మండలం మామండూరులోని కేశవరెడ్డి పాఠశాల విద్యార్థులు క్రీడా పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ నెల 19, 20, 21వ తేదీల్లో రేణిగుంట జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిని మండల స్థాయి అండర్-14, 17 బాల బాలికల క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. కబడ్డీ, కోకో, వాలీబాల్, చెస్, అథ్లెటిక్స్ వంటి క్రీడల్లో ఉత్తమ ఆటతీరును ప్రదర్శించారు. కాగా 27మంది విద్యార్థులు నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక కావడం గమనార్హం. ఈ సందర్భంగా విద్యా సంస్థల ఛైర్మన్ కేశవరెడ్డి ఆదివారం పాఠశాలలో విలేకరులతో మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో దాడి ఉన్న మేదస్సును, శారీరక బలాన్ని, ఆలోచన శక్తిని మెరుగుపరచడంలో ఎంతో ఉపయోగపడతాయన్నారు. తమ పాఠశాల విద్యార్థులు క్రీడల్లో ఉన్నతంగా రాణిస్తుండడం ఆనందంగా ఉందన్నారు.

నేడు మహాకుంభ 24వ రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి-క్యాంపస్: జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో సోమవారం మహా కుంభ 24వ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇండియా థింక్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టనున్నారు. విభిన్న అకడమిక్ సంస్థలు పాల్గొని ఈ సమావేశంలో మహాకుంభ-2025 గురించి చర్చించడం జరుగుతుంది.

ఘటోత్సవ సంరంభం

- భక్తులతో కిక్కిరిసిన గిరి వీధులు

ప్రజాశక్తి-వెంకటగిరి, డక్కిలి: వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతర ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఘటోత్సవంతో వెంకటగిరి జాతర సందడి మొదలైంది. ఐదు రోజుల పాటు జరిగే ఘటోత్సవానికి దేవదాయశాఖ, జాతర సంప్రదాయ నిర్వాహకుల ఆధ్వర్యంలో ఆదివారం శ్రీకారం చుట్టారు. తొలుత గాలిగంగుల ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జీనుగు లవారివీధిలో ఘటాలను అలంకరించారు. డప్పు చప్పుళ్లు, యువత నృత్యాలతో ఘటాల వెంట భక్తులు తరలిరాగా జీనిగుల వారివీధి, పాతకోట, రాజావీధి, పోలేరమ్మ ఆలయ ప్రాంతాలు జై పోలేరమ్మా.. నినాదాలతో హోరెత్తాయి. మొక్కులు చెల్లించే భక్తులు ఘటాల్లో పోసిన అంబలిని పలు ప్రాంతాల్లో భక్తులకు పంచిపెట్టారు. రాజాప్యాలెస్‌లోని వంటశాలలో ఘటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు సంప్రదాయబద్ధంగా సోంటన్నంను పంపిణీ చేశారు. అనంతరం పత్తి వారింట ఘటాలకు మలిపూజలు నిర్వహించారు. ఘటోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు చర్యలు తీసుకున్నారు.

పోటెత్తిన భక్తులు

ప్రశాంతతను నెలకొల్పడమే లక్ష్యం

- సీఐ సురేంద్ర నాయుడు

కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: ప్రశాంతతను నెలకొల్పడమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నట్లు సీఐ సురేంద్ర నాయుడు తెలిపారు. గేట్ పుత్తూరులో ఆదివారం వేకువ జామున కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సీఐ సారధ్యంలో పుత్తూరు ఎస్ఐ ఓబయ్య, వడమాలపేట ఎస్ఐ ధర్మారెడ్డిలు సిబ్బందితో కలిసి ఇంటింటా సోదాలు చేపట్టారు. అనుమానుత వాహనాలు, వ్యక్తుల కదలికలపై ఆరాదీశారు. నంబర్ ప్లేట్లు రికార్డులు లేని సుమారు 15ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అసాంఘిక కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని స్థానికులకు సూచించారు. పట్టణంలో ప్రశాంత వాతావరణం కోసం పోలీసులు నిరంతరం కృషి చేస్తారని సీఐ స్పష్టం చేశారు.

నేరాల కట్టడికే కార్డన్ సెర్చ్

ప్రజాశక్తి-గూడూరు టౌన్: ప్రజలు నివసించే ప్రాంతాల్లో అనుమానిత వ్యక్తులు ఏమైనా ఉన్నట్లయితే వెంటనే సంబధిత పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని గూడూరు డిఎస్పీ రమణ కుమార్ ప్రజలను కోరారు. ఆదివారం రెండో పట్టణ పరిధిలోని నివాస ప్రాంతాల్లో (కార్డాన్ సెర్చ్) తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పత్రాలు లేని వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గూడూరు శివార్లలో నిత్యం పోలీసు నిఘా కొనసాగుతుందన్నారు. బయట వ్యక్తులు ఎవరైనా ఇక్కడ తలదాచుకుని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవచ్చుననే అనుమానంతో తనిఖీలు చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పట్టణ సీఐలు శేఖర్ బాబు, శ్రీనివాస్, ఎస్ఐ మనోజ్ కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆపద కాలంలో ఆదరించింది మహిళలే..

- నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమావేశంలో పులివర్తి సుధారెడ్డి

ఆత్మీయ సమావేశంలో పులివర్తి సుధారెడ్డి

ప్రజాశక్తి-రామచంద్రాపురం(చంద్రగిరి): చంద్రగిరిలో 30ఏళ్ల చరిత్రను తిరగరాయడంలో మహిళల పాత్రే కలకం అని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి సుధారెడ్డి అన్నారు. చంద్రగిరిలోని ఓ కళ్యాణ మండపంలో ఆదివారం నియోజకవర్గ మహిళలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో సుధారెడ్డి మాట్లాడుతూ ఆపద కాలంలో ఆదరించి టీడీపీకి ఘన విజయాన్ని అందించడంలో మహిళలు కృషి చేశారని తెలిపారు. ప్రజా శ్రేయస్సు కోరే టీడీపీకి వారు వెన్నుదన్నుగా నిలిచారని, మహిళలకు ప్రత్యేక స్థానం కల్పించడంలో తమ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

అర్హులైన పేదలందరికీ టిడ్కో ఇళ్లు

జల్ జీవన్ మిషన్ ద్వారా తెలుగు గంగ నీరు: ఎమ్మెల్యే పులివర్తి నాని

ఇళ్ల నిర్మాణం కోసం కలెక్టర్‌తో కలిసి స్థల పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి- తిరుపతి(మంగళం): దశాబ్దాల కాలంగా మంగళం ప్రాంతం పూర్తిస్థాయి అభివృద్ధికి నోచుకోక, ఇక్కడ నివసించే వేలాది మంది ప్రజానీకం అవస్థలు పడుతూనే ఉన్నారు. గత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హాయంలో మంగళం పరిధిలోని పంచాయతీలలో సిసి రోడ్లు, సీసీ డ్రైన్‌లను కొంతమేర నిర్మించారు. అయితే దశాబ్దాలుగా మంగళంలో శుద్ధి అవుతున్న తెలుగుగంగ నీరు తిరుపతి పట్టణానికి మాత్రమే సరఫరా చేస్తున్నారు. ఈ ప్రాంతంలో నీటిశుద్ధి కేంద్రం ద్వారా శుద్ధి అయిన నీరును ఇక్కడి ప్రజానీకానికి కూడా అందిస్తామని పాలకులు హామీలు అయితే ఇస్తున్నారు గాని నెరవేర్చిన దాఖలాలు లేవు.. ఏళ్ల తరబడి తెలుగు గంగా నీరు వస్తుందని ప్రజల ఎదురుచూపులు ఆశలుగానే మిగిలిపోతున్నాయి.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తప్పకుండా తెలుగు గంగ నీటిని ఉమ్మడి శెట్టిపల్లె పంచాయతీ ప్రజలకు అందిస్తానని చంద్రగిరి నియోజకవర్గ శాసనసభ అభ్యర్థిగా ఎన్నికల ప్రచారంలో పులివర్తి నాని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన ఇవి మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా త్వరలోనే కేంద్ర ప్రభుత్వం జల్ జీవన్ మిషన్ ద్వారా ఉమ్మడి శెట్టిపల్లె పంచాయతీ ప్రజలకు తెలుగు గంగ నీటిని అందిస్తానని ప్రకటించారు. అదేవిధంగా గత ప్రభుత్వ హాయంలో ఉమ్మడి శెట్టిపల్లె పంచాయతీ పరిధిలో ఉన్న పేదప్రజలకు ఇంటి పట్టాలను శ్రీకాళహస్తి నియోజకవర్గ పరిధిలోని చిందేపల్లెలో ఇచ్చారు. కానీ స్థలాలను చూపలేదు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మంగళం పరిధిలోని తిరుమలనగర్ గ్రామపంచాయతీలో గతంలో సర్వే ట్రైనింగ్ అకాడమీకి కేటాయింపు చేసిన స్థలంలో టిడ్కో ఇళ్లను కట్టిస్తానని ఎమ్మెల్యే పులివర్తి నాని చెప్పారు. దీంతో పట్టాలు పొందిన వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వీలైనంత త్వరగా టిడ్కో ఇళ్ల నిర్మాణం జరిపి ఇళ్ల కేటాయింపు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పేదలందరికీ టిడ్కో ఇళ్లు..

మంగళంలో గత ప్రభుత్వ హాయంలో స్థానికంగా ఉన్న అర్హులైన పేదలందరికీ ఇళ్ళ పట్టాలు మంజూరు చేసి స్థలాలు చూపలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే స్థానిక తిరుమల నగర్ పంచాయతీలో గతంలో సర్వే ట్రైనింగ్ అకాడమీకి కేటాయించిన స్థలంలో టిడ్కో ఇళ్ళ నిర్మాణానికి శ్రీకారం చుడుతామని ఇచ్చిన హామీ మేరకు కలెక్టర్ వెంకటేశ్వర్ కలిసి ఎమ్మెల్యే పులివర్తి నాని స్థలపరిశీలన చేశారు. సర్వే ట్రైనింగ్ అకాడమీకి ఇప్పటికే సామర్లకోట నుండి పని చేస్తోందని, మంగళంలో కేటాయించిన స్థలాన్ని అర్హులైన పేదలకోసం నిర్మించే టిడ్కో ఇళ్ళకు కేటాయించి, నిర్మాణ పనులు ప్రారంభించాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు.



ఎమ్మెల్యే పులివర్తి నాని

జల్ జీవన్ మిషన్ ద్వారా....

మంగళంలో ఉన్న తెలుగుగంగ నీటిశుద్ధి కేంద్రం నుంచి ఇప్పటికే తిరుపతి నగర ప్రజలకు నీరు అందుతోందని, అధికారంలోకి వచ్చాక మంగళంలో ఉన్న స్థానిక ప్రజలకు తెలుగుగంగ నీటిని అందిస్తామన్న హామీ మేరకు పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ జల్ జీవన్ మిషన్ ద్వారా తెలుగుగంగ నీటి పైప్‌లైను పనులను త్వరలోనే ప్రారంభిస్తామని ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు.

క్రైం కార్నర్

గుడారాలు దగ్ధం

- నిప్పంటించిన గుర్తు తెలియని వ్యక్తులు

ప్రజాశక్తి-నాయుడుపేట: పట్టణంలో బిఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట డివైడర్‌లపై ఉన్న సంచార జాతులకు చెందిన మూడు గుడారాలను గుర్తు తెలియని వ్యక్తులు శనివారం అర్ధరాత్రి నిప్పంటించారు. సంచార జాతుల వారు గత 30ఏళ్లగా బిఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట ఒక ప్రైవేటు స్థలం ముందు దుకాణాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. గుడారాలు పూర్తిగా దగ్ధమైయ్యాయి. బాధితులు లబోదిబోమన్నారు.

కుక్కల దాడిలో 15పొట్టేళ్ళు మృతి..

ప్రజాశక్తి- వరదయ్యపాలెం: కుక్కలు దాడిలో 15 పొట్టళ్ళు మృతి చెందిన ఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. సీఎల్ఎన్ పల్లి చావాలి ఎస్సీ కాలనీకి చెందిన వెంపల్ల రామకృష్ణయ్య, వెంపల్ల లక్ష్మయ్య వెంపల్ల వేమయ్య అనే పాడి రైతులు పొట్టేళ్ల పెంపకం ద్వారా జీవనం సాగిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. గ్రామ సమీపంలో అరిక సేలు వద్ద క్వారీల సమీపంలో మేత మేస్తుండగా కుక్కలు దాడి చేశాయి. ఈ దాడిలో 15పొట్టేళ్ళు మృతి చెందగా మరో ఏడు గాయపడ్డాయి. బాధిత పాడి రైతులు అక్కడకు వెళ్లి చూడగా మృతి చెందిన పొట్టేళ్ళు చూసి లబోదిబోమన్నారు సుమారు రూ.2లక్షల మేర నష్టం జరిగినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

అనారోగ్యంతో బాలుడు మృతి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పరిధిలోని ప్రభుత్వ పరిశీలన గృహంలో ఉన్న ఓ మైనర్ బాలుడు అనారోగ్యంతో మృతి చెందాడు. ఆరు నెలల కిందట భాకరాపేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన అత్యాచార కేసులో నిందితుడిగా పేర్కొనబడిన గుడియాత్తం ప్రాంతానికి చెందిన వేలు అనే మైనర్ బాలుడు రెండు రోజుల క్రితం అనారోగ్య సమస్యతో బాధపడుతుండగా ప్రభుత్వ పరిశీలన గృహం అధికారులు రూయా ఆసుపత్రిలో అడ్మిట్ చేశారు. చికిత్స పొందుతున్న బాలుడు ఆదివారం తెల్లవారుజామున మృతి చెందినట్లుగా అధికారులు తెలిపారు.

పార్టీలకతీతంగా పాలన అందిస్తాం: ఎమ్మెల్యే పులివర్తి



సభలో ప్రసంగిస్తున్న చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని

ప్రజాశక్తి-యర్రావారిపాళ్యం: పార్టీలకతీతంగా పరిపాలన అందిస్తామని, అభివృద్ధి కార్యక్రమాల్లో అందరి సమన్వయంతో ముందుకు వెళతామని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. మండలంలోని ఉస్తికాయలపెంట పంచాయతీలో ఆదివారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేసిందని, గాడిన పెట్టి సరైన పాలన ఇవ్వడానికి ఈ ప్రభుత్వానికి మూడు నెలల కాలం పట్టిందని చెప్పారు. గ్రామాల్లోని ప్రజలందరి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం పలువురు గ్రామస్తుల విన్నపాల మేరకు పంచాయతీలోని ఎగువ, దిగువ హరిజనవాడ, పడమటిపల్లి, కంసాలపల్లి, తదితర గ్రామాలకు రోడ్డు ఏర్పాటు, తాగునీరు, శ్మశాన వాటికకు సంబంధించి ఇప్పటికే నివేదికలు పంపినట్లు వివరించారు. అర్లపెంట వంక నిర్మాణం, తలకోన నీటిని చెరువులకు కాలువలు ద్వారా అనుసంధానం చేసి రైతులకు నీటి సమస్య తలెత్తకుండా చూస్తామని హామీ ఇచ్చారు. గత ఎమ్మెల్యే లాగా చుట్టపురీతిగా వచ్చి వెళ్లడం సరికాదని అభిప్రాయపడ్డారు. ఇచ్చిన హామీలన్నీ పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో అమరనాథ్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలన్నీ నెరవేరుస్తాం: ఎమ్మెల్యే ఆరణి

పోస్టర్లు చూపుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలన్నీ రాష్ట్ర ప్రభుత్వం నెరవేరుస్తుందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. నగరంలోని ఎస్టీవీ నగర్‌లో ఆదివారం జరిగిన ప్రజావేదికలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఒకటవ తేదీనే ఉద్యోగులకు జీతాలు ఇవ్వడమే కాకుండా పెన్షనర్లకు పెన్షన్ అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ 17వేల మందితో మెగా డిఎస్సీని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌లు ప్రకటించారని ఆయన చెప్పారు. ఐదేళ్ళలో 20లక్షల ఉద్యోగల భర్తీకి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టల నిర్మాణాల వేగవంతానికి, పారిశ్రామిక అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించడం శుభపరిణామమని ఆయన చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సిఎంఎం కృష్ణవేణి, అర్బన్ తహశిల్దార్ భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఇది మన ప్రజా ప్రభుత్వం: ఎమ్మెల్యే సునీల్



ఎమ్మెల్యేకి స్వాగతం పలుకుతున్న నాయకులు

ప్రజాశక్తి-చిట్టమూరు: ప్రజలందరూ మెచ్చిన ప్రజా ప్రభుత్వం అని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని మార్కండేయ నాయుడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చింది మొదలు సీఎం చంద్రబాబు పాలనను గాడిన పెట్టేందుకు నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. ఇచ్చిన హామీలు ఒకొక్కటిగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఏర్పాటైన వంద రోజుల్లో చేపట్టి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఆయన వివరించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి భారతి రెడ్డి, నాయకులు ముత్తు రాజా, శరత్ చంద్రారెడ్డి, నారాయణ, జనార్ధన్ రెడ్డి, రాజేష్ రెడ్డి, గిరి నాయుడు, సుందరయ్య నాయుడు, శివారెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, ఏడుకొండలు పాల్గొన్నారు.